సాక్షి నిజామాబాద్

మంగళవారం ౹ 11 ౹ జూన్ ౹ 2024



ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

ఎన్నికల కోడ్ కారణంగా తాత్కాలికంగా వాయిదా పడిన ప్రజావాణి తిరిగి ప్రారంభం కావడంతో ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

- 8లో ▸



చైన్ స్నాచర్ల అరెస్ట్

ఆర్మూర్ డివిజన్ పరిధిలో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన నిందితులను అరెస్టు చేసినట్లు ఏసీపీ బస్వారెడ్డి తెలిపారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 36.7 /25.5

ఆకాశం మేఘావృతమవుంది. అక్కడక్కడ మోస్తరు జల్లులు కురిసే అవకాశాలున్నాయి. సాయంత్రం చల్లని గాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డిబార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల్లో సోమవారం మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ఇద్దరు విద్యార్థులు డిబార్‌కు గురైనట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. నిజామాబాద్‌లోని ఎస్ఎస్ఆర్ డిగ్రీ కాలేజ్, ఆర్మూర్‌లోని నరేంద్ర డిగ్రీ కాలేజ్ పరీక్షా కేంద్రంలో ఒక్కొక్కరి చొప్పున మొత్తం ఇద్దరు విద్యార్థులు డిబారైనట్లు ఆయన పేర్కొన్నారు. వర్సిటీ పరిధిలోని 38 పరీక్షా కేంద్రాల్లో ఉదయం జరిగిన డిగ్రీ 6వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 6,086 మంది విద్యార్థులకు గాను 5,670 మంది హాజరు కాగా 414 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. మధ్యాహ్నం జరిగిన 1వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 3,050 మంది విద్యార్థులకు గాను 2,840 మంది హాజరు కాగా 210 మంది పరీక్ష రాయలేదని తెలిపారు.

ఎంఎల్‌హెచ్‌పీలకు నియామకపత్రాల అందజేత



నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్‌లలో ఎంఎల్‌హెచ్‌పీలను నియమించారు. ఇందుకు సంబంధించి జిల్లాలో మొత్తం 46 మందికి డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ నియామక పత్రాలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ గ్రామీణ ప్రజల ఆరోగ్యాన్ని పెంపొందించడం, ప్రజల జీవన శైలిని మార్చడంలో ఎంఎల్‌హెచ్‌పీలు భాగస్వాములు కావాలని సూచించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం పెంచాలన్నారు. కార్యక్రమంలో ఏవో చందర్, డాక్టర్ వెంకటేశ్, సూపరింటెండెంట్ వినయ్ కుమార్, డీహెచ్ఈ ఘన్పూర్ వెంకటేశ్వర్లు, హెచ్ఈవో నాగరాజు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా రైఫిల్ షూటింగ్‌కు రేఖారాణి



నిజామాబాద్‌నాగారం: ఆల్ ఇండియా పోలీస్ రైఫిల్ షూటింగ్ పోటీలకు నగరంలోని నాల్గో టౌన్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ రేఖారాణి (డబ్ల్యూ పీసీ 325) ఎంపికయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లోని పోలీస్ అకాడమీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో రేఖారాణి రాణించారు. ఈనెల 15 నుంచి తమిళనాడులోని ఒటీవాకం ఫైరింగ్ రేంజ్‌లో నిర్వహించనున్న ఆలిండియా పోలీస్ రైఫిల్ షూటింగ్ పోటీల్లో రాష్ట్ర పోలీస్ జట్టు తరపున రేఖారాణి పాల్గొననున్నారు. 2002లో ఉద్యోగంలో చేరిన రేఖారాణి.. ఫుట్‌బాల్, మాస్టర్ అథ్లెటిక్స్‌లో సైతం రాణించి పతకాలు సాధించారు. ఆమె ఎంపికపై పోలీసు యంత్రాంగం హర్షం వ్యక్తం చేసింది.

ఏసీజీఈ, డీసీఈబీల నియామకం

కామారెడ్డి టౌన్: అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ (ఏసీజీఈ) జిల్లా అధికారిగా బలరాం నియమితులయ్యారు. జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి(డీసీఈబీ)గా లింగంకు బాధ్యతలు అప్పగించారు. ఈ విషయాన్ని డీఈవో రాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

రెండు రోజుల్లో తనిఖీలను పూర్తిచేయాలి



నిజామాబాద్‌నాగారం: ప్రైవేటు ఆస్పత్రుల్లో తనిఖీల ప్రక్రియ రెండు రోజుల్లో పూర్తి చేయాలని డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో సుమారు 50 టీంలు ఆస్పత్రుల్లో తనిఖీలు చేస్తున్న విషయం తెలిసిందే. ఆస్పత్రులకు రిజిస్ట్రేషన్ ఉందా.. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం నిబంధనలు పాటిస్తున్నారా వంటి వివరాలను తనిఖీ బృందాలు పరిశీలిస్తున్నాయి. ఆర్ఎంపీలు, పీఎంపీలు నిర్వహిస్తున్న ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌లు సైతం నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా అని పర్యవేక్షిస్తు న్నాయి. అయితే ఈ సర్వేను రెండు రోజుల్లో అన్నింటిని పూర్తి చేసి నివేదికలను సమర్పించాలని డీఎంహెచ్‌వో ఆదేశించినట్లు సమాచారం. తనిఖీల్లో వైద్యశాఖ బృందాల సభ్యులు సంతోష్, శ్రీరాం యాదవ్, అలేఖ్య, శ్రీనివాస్, శ్రీధర్, రఘు తదితరులు ఉన్నారు.

సర్వం కల్తీమయం

హైదరాబాద్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలు ఇటీవల జిల్లాలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో పలు రెస్టారెంట్లలో ఆహార నాణ్యతలో డొల్లతనం బయటపడింది. పైకి వెలుగు జిలుగులతో ఆకర్షించే రెస్టారెంట్లు, హోటళ్లలోని కిచెన్లలో అపరిశుభ్ర వాతావరణంతో ఈగలు, బొద్దింకలు తిరగడాన్ని గుర్తించారు.



- ఫుడ్ సేఫ్టీ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ దాడుల్లో వెలుగులోకి ఆహార కల్తీ
- రెస్టారెంట్లు, హోటళ్లలో అపరిశుభ్రంగా కిచెన్లు
- ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోని ఫుడ్‌సేఫ్టీ విభాగం
- నిల్వచేసిన ఆహారంతో దీర్ఘకాల అనారోగ్యమంటున్న వైద్యనిపుణులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : కాదేదీ కల్తీకి అనర్హం అనేలా పరిస్థితి తయారైంది. ఆహార ధాన్యాలు పండించే రైతులకు నకిలీ విత్తనాలు అంటగట్టే ప్రబుద్ధులు ఉన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయి ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు సైతం ఉన్నాయి. అయితే అనేక వ్యయప్రయాసలకు ఓర్చి ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు రాని సందర్భాలే కోకొల్లలు. అందువల్ల రైతులు లాభం పొందేది నామమాత్రమే. వినియోగదారుడి కంటే దళారులే ఎక్కువ లబ్ధి పొందుతున్నారు. ఇదిలా ఉండగా రైతులు పండించిన ధాన్యాలతో ఆహార వ్యాపారం చేసే రెస్టారెంట్లు, హోటళ్ల నిర్వాహకుల కక్కుర్తి కారణంగా ప్రజారోగ్యం తీవ్రంగా దెబ్బతింటోంది. ఇక్కడ కూడా వినియోగదారులే దగాకు గురవుతున్నారు. అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా' మేరకు పాటించాల్సిన నిబంధనలను అమలు చేయాల్సిన అధికార యంత్రాంగం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో చాలా రెస్టారెంట్లు, హోటళ్ల యజమానులు, నిర్వాహకులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు.

ఇటీవల రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆదేశాల మేరకు హైదరాబాద్ నుంచి వచ్చిన స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలు జిల్లాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాయి. పలు రెస్టారెంట్లపై దాడులు చేసి ఆహార నాణ్యత, పాటిస్తున్న శుభ్రత గురించి అనేక నివ్వెరపోయే విషయాలు కనుగొన్నారు. బాగా పేరుపొందిన రెస్టారెంట్లు, హోటళ్లలోనే ఈవిధంగా ఉంటే సాధారణ ఆహార విక్రయ దుకాణాల పరిస్థితి ఏమిటనే చర్చ వస్తోంది.

కిచెన్లను చూస్తే వాంతులే..

రెస్టారెంట్ల కిచెన్లలో అపరిశుభ్ర వాతావరణం వల్ల దట్టంగా ఈగలు, బొద్దింకలు ఆహార పదార్థాలపై తిరుగుతుంటాయి. అక్కడ గిన్నెలు, ప్లేట్లు కడిగే నీళ్లు సైతం వాడిన వాటినే మళ్లీ వాడుతారు. ఇక నూనె గురించి చెబితే వాంతులు అవుతాయి. వేడిచేసిన నూనెనే మళ్లీ మళ్లీ వేడి చేస్తూ వాడుతారు. రోజుల తరబడి ఫ్రిజ్‌లో నిల్వ చేసిన మాంసం, ఫంగస్ వచ్చిన కూరగాయలు, పులిసిపోయిన పెరుగు, ఎక్స్‌పైర్ అయిన పిజ్జాలు, బర్గర్‌లు, హానికరమైన ఫుడ్ కలర్‌లు, ఫంగస్ పట్టిన మసాలాలు వాడుతున్న దౌర్భాగ్యం.

ధరలు ఆకాశంలో.. నాణ్యత పాతాళంలో..

రెస్టారెంట్లు, హోటళ్లు పైకి చూడడానికి ఆకర్షణీయంగా ఉంటాయి. వెలుగు జిలుగులతో నేమ్ బోర్డులు ఏర్పాటు చేస్తారు. ఎంట్రన్స్ మొదలు లోపలికి వెళ్లిన తర్వాత కూర్చునే సోఫాలు, కుర్చీలు, టేబుళ్లు అద్దంలా మెరిసిపోతుంటాయి. మెనూ పుస్తకం సైతం రాయల్‌గా ఉంటుంది. ధరలు చూస్తే మాత్రం కళ్లు బైర్లు కమ్మాల్సిందే. పేదలు వారం రోజుల పాటు ఇంటిల్లిపాదీ తినే ఖర్చు ఒక యూనిట్ ఆహారానికి ధరలు చెల్లించాల్సిన పరిస్థితి. ఇక ఆహారం తయారు చేసే కిచెన్ గురించి చెప్పుకోవాలంటే పుస్తకాలు కూడా సరిపోవు. నిజామాబాద్ నగరంతో పాటు ఇతర పట్టణాలు, మండలాల్లో ఆహార కల్తీకి సంబంధించి అనేక ఫిర్యాదులు వచ్చినప్పటికీ జిల్లాలోని సంబంధిత అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరించిన దుస్థితి ఉంది. హోటళ్ల కిచెన్‌లు చూస్తే కళ్లు తిరిగి కిందపడాల్సిందే. పైగా అక్కడికి వెళితే వినియోగదారుడి వాసన తగిలి ఇన్‌ఫెక్షన్ ప్రబలుతుందనే విధంగా రెస్టారెంట్ల నిర్వాహకులు కలరింగ్ ఇస్తుండడం విశేషం. ఇక ముఖ్యమైన అంశమేమిటంటే మంచినీళ్లు అందుబాటులో ఉంచరు. వాటర్ బాటిళ్లు కచ్చితంగా అంటగడతారు. ఈ నీళ్ల బాటిల్స్ ధర లీటరుకు రూ.30 నుంచి రూ.60 వరకు వసూలు చేస్తుండడం బట్టి ఏ స్థాయిలో వ్యాపారం చేస్తున్నారో అర్థం అవుతోంది. వినియోగదారులను దోపిడీ చేసి అనారోగ్యం అంటగడుతుండడం విశేషం.

మళ్లీ మళ్లీ వేడిచేసే ఆహారం విషపూరితం

నాణ్యత లేని అపరిశుభ్రమైన, రోజుల తరబడి నిల్వ చేసిన ఆహారాన్ని తీసుకోవడంతో లెక్కలేనన్ని వ్యాధులు వస్తాయి. ఆహారాన్ని మళ్లీ మళ్లీ వేడి చేసి తినడం కారణంగా విషపూరితం అవుతుంది. అజీర్ణం, కడుపు ఉబ్బడం, వాంతులు, విరేచనాలు అవుతాయి. బాక్టీరియా, ఫంగల్ వ్యాధులు వస్తాయి. వీటితో పాటు చాలామందికి దీర్ఘకాలిక వ్యాధులు సంభవిస్తాయి. రోగనిరోధక శక్తి తక్కువ ఉన్నవారికి, కిడ్నీ, షుగర్ వ్యాధులు ఉన్నవారికి ఇన్‌ఫెక్షన్లు మరింత త్వరగా సోకుతాయి.

– అంగల దీపక్‌రెడ్డి, ఎండీ, జనరల్ మెడిసిన్

పదోన్నతులు సాగేనా?



భాషా పండితుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

- కొనసాగుతున్న పండిత్‌లు, పీఈటీల ప్రమోషన్ల ప్రక్రియ
- తమకు అన్యాయం జరుగుతోందని ఎస్జీటీల మండిపాటు
- సుప్రీంకోర్టు మెట్లెక్కనున్న టీచర్లు

నిజామాబాద్‌అర్బన్: పండిత్, పీఈటీల అప్‌గ్రేడేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. అయితే దీన్ని సవాల్ చేస్తూ ఎస్జీటీలు సుప్రీం కోర్టు మెట్లు ఎక్కనున్నారు. దీంతో ప్రమోషన్ల ప్రక్రియ కొనసాగుతుందా.. నిలిచిపోతుందా అనే సందిగ్ధత నెలకొంది. బదిలీలు, పదోన్నతులపై ఇటీవల హైకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా విద్యాశాఖ షెడ్యూల్ జారీ చేసింది. దీని ఆధారంగా ఈ నెల 8న ప్రారంభమైన ప్రక్రియ ఈ నెల 22వ తేదీ వరకు జరుగనుంది. అయితే పదోన్నతులపై ఎస్జీటీలు కోర్టును ఆశ్రయించనుండడంతో ప్రక్రియకు మళ్లీ బ్రేక్ పడే అవకాశం ఉంది.

సుప్రీం కోర్టుకు..

పండిత్, పీఈటీ అప్‌గ్రేడేషన్‌కు సంబంధించి కామన్ సీనియారిటీ ప్రకారం అందరికీ పదోన్నతులు ఇవ్వాలని హైకోర్టు సింగిల్ బెంచ్ గతేడాది తీర్పు ఇచ్చింది. దీనిని సవాల్ చేస్తూ పండిత్, పీఈటీలు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించగా మే నెలలో పండిత్‌లకు అనుకూలంగా తీర్పు వచ్చింది. దీంతో విద్యాశాఖ అప్‌గ్రేడేషన్ ప్రక్రియ చేపట్టింది. కానీ వారికి పదోన్నతులు ఇస్తే మాకు అన్యాయం జరుగుతుందని ఎస్జీటీలు పేర్కొంటున్నారు. 25 ఏళ్ల సర్వీసు ఉన్నా ప్రమోషన్‌కు నోచుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2017లో ఉద్యోగంలోకి వచ్చిన పండిత్‌లకు పదోన్నతులు వస్తున్నాయని.. 1998లో ఉద్యోగం పొందిన ఎస్జీటీలకు ప్రమోషన్లు రావడం లేదని ఆందోళన చెందుతున్నారు. ఈ దశలో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టు మెట్లు ఎక్కేందుకు సిద్ధమయ్యారు.

ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పదోన్నతిపై పేచి

ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పదోన్నతిని కనీసం ఇంటర్ ఉండి టీటీసీ, డీఎడ్ చేసిన వారికి ఇవ్వాలని గతేడాది సెప్టెంబర్‌లో హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఇందుకు అనుగుణంగా విద్యాశాఖ ఈనెల 3న మార్గదర్శకాలను విడుదల చేసింది. ఇందులో భాగంగా టీటీసీ చేసిన వారితో సీనియారిటీ లిస్టు తయారు చేయాలని డీఈవోను ఆదేశించింది. కానీ జిల్లా విద్యాశాఖ అధికారులు ఇప్పటి వరకు జాబితాను రూపొందించలేదు. తాత్కాలిక జాబితాను ఈనెల 8న డీఈవో విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చారు.

పీఎస్ హెచ్ఎం పోస్టులు ఇవ్వాలని..

రాష్ట్రంలో పండిత్, పీఈటీల అప్‌గ్రేడేషన్ వల్ల 2017లో పోస్టింగ్ వచ్చిన వారికి కూడా ప్రమోషన్ లభిస్తుంది. అయితే జిల్లాలో ప్రస్తుతం ఎస్ఏ పదోన్నతి పోస్టులు 250 నుంచి 300 వరకే ఉన్నాయి. ఒకవేళ పండిత్, పీఈటీల ప్రమోషన్ ప్రక్రియ పూర్తిచేసి.. ఎస్జీటీలకు పదోన్నతులు ఇవ్వాలనుకున్నా కేవలం 1998–డీఎస్సీ వారికి మాత్రమే లభిస్తాయి. గణితం, సైన్స్ విభాగంలో 2002లో డీఎస్సీలో ఉద్యోగం సాధించిన వారికే వస్తాయి. 20 ఏళ్ల పైబడి సర్వీసు పూర్తయినా కూడా పదోన్నతి రాని పరిస్థితి నెలకొంది. అలాగే ప్రాథమిక పాఠశాల్లో హెచ్ఎం పోస్టులు లేక విద్యా వ్యవస్థ గాడితప్పింది. కావున గత ప్రభుత్వం ప్రకటించినట్లుగా 10వేల పీఎస్ హెచ్ఎం పోస్టులు మంజూరు చేసి పదోన్నతులు కల్పిస్తే సీనియర్ ఎస్జీటీలకు న్యాయం చేసినట్లవుతుందని టీచర్లు కోరుతున్నారు.

పీఎస్ హెచ్ఎం పోస్టులు మంజూరు చేయాలి



ప్రాథమిక పాఠశాలలో గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఇంకా పదోన్నతి రాకుండానే పదవీ విరమణ పొందుతున్నారు. కావున 10వేల పీఎస్ హెచ్ఎం పోస్టులు మంజూరు చేస్తే అందరికీ సమన్యాయం చేసినట్లు అవుతుంది.

– అంకం నరేశ్, ఎస్జీటీ

కోర్టును ఆశ్రయిస్తాం



ఎస్జీటీలకు కాకుండా పండిత్‌లను అప్‌గ్రేడ్ చేయడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. మేం కోర్టును ఆశ్రయించి న్యాయం కోరుతాం. సంవత్సరాల తరబడి సీనియారిటీ ఉన్న ఎస్జీటీలను కాదని భాషా పండిత్‌లకు అప్‌గ్రేడ్ చేయడం అన్యాయం. ఉన్నతాధికారులు దీనిపై పునరాలోచన చేయాలి.

– వినోద్‌కుమార్, టీసీ టీచర్స్ జిల్లా అధ్యక్షుడు

పీటీఐలు, సీజీవీలను విధుల్లోకి తీసుకోవాలి

- ఉత్తర్వులు జారీచేసిన సమగ్ర శిక్ష ఎక్స్‌అఫీషియో స్టేట్ పీడీ మల్లయ్య

ఆర్మూర్: నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలు, భవిత కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు(పీటీఐ), కేర్ గివింగ్ వాలంటీర్లు(సీజీవీ)లను తిరిగి విధుల్లో చేర్చుకోవాలని సమగ్రశిక్ష ఎక్స్‌అఫీషియో స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ మల్లయ్య భట్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న వీరిని ఏప్రిల్ 23న విద్యా సంవత్సరం చివరి రోజు విధుల నుంచి తొలగించిన విషయం విదితమే. ఈ విద్యా సంవత్సరం కోసం తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సూచిస్తూ ఆయా జిల్లాల విద్యాధికారులకు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభం నుంచి వీరు యాథావిధిగా విధులు నిర్వహించాల్సి ఉంటుంది. జిల్లాలో 88 మంది పీటీఐలు, 19 మంది సీజీవీలు ప్రభుత్వ పాఠశాలలు, భవిత కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్నారు. అయితే తిరిగి వీరిని విధుల్లోకి తీసుకొనే సమయంలో 61 ఏళ్ల వయస్సు నిండిన వారిని మాత్రం విధుల్లోకి చేర్చుకోవద్దంటూ ప్రత్యేకంగా సూచించారు. ఏళ్ల తరబడి పీటీఐలు, సీజీవీలతో సేవలు పొందిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రిటైర్‌మెంట్‌ను ప్రకటిస్తూ ఖాళీ చేతులతో పదవీ విరమణ చేయించడంపై సమగ్ర శిక్ష ఉద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

నిరాశాజనకంగా సాగర్



నిజాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం

నిజాంసాగర్(జుక్కల్): ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వరప్రదాయిని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం నీటి నిల్వలు నిరాశాజనకంగా ఉన్నాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రానికి 1390.72 అడుగుల(4.347 టీఎంసీలు) నీరు మాత్రమే నిల్వ ఉంది. ఈ యేడు భారీ వర్షాలు కురిసి ప్రాజెక్టు నిండితేనే ఆయకట్టుకు భరోసా లభిస్తుంది.

నారుమళ్లకూ నీరు కరువు

నిజాంసాగర్ ప్రాజెక్టు కింద ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 2.75 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. చివరి ఆయకట్టు ప్రాంతానికి అర్గుల్‌రాజారాం, గుత్పతో పాటు శ్రీరాంసాగర్ రివర్స్ పంపింగ్ ద్వారా సాగు నీరు అందిస్తున్నారు. మొదటి ఆయకట్టు పరిధిలోని నస్రుల్లాబాద్, వర్ని, కోటగిరి, బోదన్, రుద్రూర్, నవీపేట మండలాల్లోని రైతులు ప్రాజెక్టు నీటితోపాటు బోరుబావుల ఆధారంగా పంటలు సాగు చేస్తారు. నిజాంసాగర్, మహమ్మద్‌నగర్, బాన్సువాడ, బీర్కూర్ మండలాల్లోని 30 వేల ఎకరాల ఆయకట్టుకు ప్రాజెక్టు నీరే ఆధారం. ప్రధాన కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తేనే ఈ ప్రాంతంలో నారు పోసుకునే పరిస్థితి ఉంది. దీంతో ఈ ప్రాంత రైతులు ప్రాజెక్టు నీటి కోసం ఎదురుచూస్తున్నారు. నారు మళ్లను సిద్ధం చేసుకునేందుకు నీటిని విడుదల చేయాలని కోరుతున్నారు.

నత్తనడకన తల్లి చేపల వేట!

- ఇప్పటి వరకు పట్టింది 800 కిలోలే..
- ఇంకా 700 కిలోల చేపలు అవసరం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ దిగువన గల జాతీయ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో.. చేప పిల్లలను ఉత్పత్తి చేసేందుకు గాను కావాల్సిన తల్లి చేపల వేట నత్తనడకన సాగుతోంది. ఈ కేంద్రంలో ఐదు కోట్ల చేపపిల్లలను ఉత్పత్తి చేయడం కోసం 1500 కిలోల తల్లి చేపలు అవసరం ఉంటుంది. దీంతో పక్షం రోజుల క్రితం నుంచి వేటను అధికారులు ప్రారంభించారు. జిల్లాలో ఎంపిక చేసిన కొన్ని చెరువుల్లో తల్లి చేపలను వేట నెమ్మదిగా కొనసాగుతోంది. ఇప్పటి వరకు 800 కిలోల తల్లి చేపలను మాత్రమే వేటాడి కేంద్రానికి తరలించారు. మరో 700 కిలోలు అవసరం ఉంది. తల్లిచేపలను సున్నితంగా వేటాడి ఎలాంటి గాయాలు కాకుండా తీసుకురావాల్సి ఉండడంతో కొంత ఆలస్యమవుతుందని అధికారులు చెబుతున్నారు. అంతే కాకుండా ఎంపిక చేసిన కొన్ని చెరువుల్లో ఇప్పటికీ నీరు అధికంగా ఉండడం వల్ల చేపలవేట సాగడం లేదని పేర్కొంటున్నారు. చేప పిల్లల ఉత్పత్తి కోసం ఉపయోగించే తల్లి చేపలను వలతో మాత్రమే వేటాల్సి ఉంటుంది. కండ్రీలతో వేటాడితే అవి గాయపడతాయి. అయితే ముందస్తుగా చేపల వేట సాగించి ఉంటే పరిస్థితి ఇలా ఉండేది కాదని మత్స్యకారులు అంటున్నారు. చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో గల మట్టి కుండీల్లో తల్లి చేపలను వేసి వాటికి దాణా ఇస్తూ.. జూలై మాసం ప్రారంభంలో గుడ్డును సేకరించి, హెచరీలో వేసి స్పాన్‌ను ఉత్పత్తి చేస్తారు.



చెరువులో వేటాడిన తల్లి చేపలు

ముంచుకొస్తున్న కాలం..

చేప పిల్లల ఉత్పత్తికి కాలం ముంచుకొస్తుంది. సాధారణంగా జూలై, ఆగస్టు మాసాల్లో చేపలు సహజ సిద్ధంగా పిల్లలు పెడుతుంటాయి. తల్లి చేపలను దాణా వేసి బాగా పెంచితే నాణ్యమైన గుడ్డు వచ్చి ప్రయోగాలు విఫలం చెందకుండా పూర్తిస్థాయిలో స్పాన్ వచ్చే అవకాశం ఉంటుంది. కానీ తల్లి చేపల సేకరణనే ఆలస్యంగా కొనసాగుతుండడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. తల్లి చేపల సేకరణను త్వరగా పూర్తి చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.

సేకరణ కొనసాగుతోంది

చేప పిల్లల ఉత్పత్తి కోసం కావాల్సిన తల్లి చేపల సేకరణ కొనసాగుతోంది. కొన్ని చెరువుల్లో నీరు ఎక్కువగా ఉండడం వలన వేట సాగడం లేదు. ఇప్పటి వరకు 800 కిలోల తల్లి చేపలను సేకరించడం జరిగింది.

– లాయక్ మొహీనొద్దీన్, మత్స్య అభివృద్ధి అధికారి, పోచంపాడ్

పశువుల అక్రమ రవాణా నిరోధానికి చర్యలు

- అదనపు కలెక్టర్ ఎస్ కిరణ్‌కుమార్

సుభాష్‌నగర్: పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు గట్టి నిఘా ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బక్రీద్‌ను పురస్కరించుకుని అదనపు కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో సోమవారం జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జంతు సంక్షేమం, గోవధ నిషేధంపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతు సంక్షేమం కోసం ఉద్దేశించిన చట్టాలు పక్కాగా అమలయ్యేలా చూడాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు. గోవధను నిషేధించినందున ప్రజలకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు జిల్లాలోని కందకుర్తి, సాటాపూర్, సాలూర, పాతంగల్, ఖండ్ గావ్, యంచ, పోచంపాడ్, కమ్మర్‌పల్లి, ఇందల్వాయి తదితర ప్రాంతాల వద్ద ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. రెవెన్యూ, పోలీస్, రవాణా శాఖలకు చెందిన అధికారులు నిరంతరం నిఘా ఉండేలా పర్యవేక్షణ చేయాలన్నారు. నిబంధనలు విరుద్ధంగా వివిధ వాహనాల్లో పశువులను తరలిస్తే వెంటనే సీజ్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సాటాపూర్, ఇందల్వాయి తదితర చోట్ల కొనసాగే పశువుల వారాంతపు సంతల్లో నిబంధనలు అనుగుణంగా, పశు సంరక్షణ చట్టానికి లోబడి క్రయవిక్రయాలు జరిగేలా చూడాలన్నారు. బక్రీద్ సందర్భంగా ఎక్కడబడితే అక్కడ పశువులను వధించకుండా కట్టడి చేయాలన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ కోటేశ్వర్ రావు, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, రాజేశ్వర్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి జగన్నాథ చారి, డీపీవో కార్యాలయ ఏవో సిద్ధిరాములు, నగరపాలక సంస్థ ఎంహెచ్‌వో సాజిద్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రాంచందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

క్లుప్తంగా

'న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తా'


జగన్‌మోహన్‌గౌడ్‌

ఖలీల్‌వాడి: న్యాయవాదుల సమస్యల పరిష్కారంతోపాటు వారి సంక్షేమానికి కృషి చేస్తానని తెలంగాణ ఫెడరేషన్‌ ఆఫ్‌ బార్‌ అసోసియేషన్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన మల్లెపూల జగన్‌మోహన్‌ గౌడ్‌ అన్నారు. అసోసియేషన్‌ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం రంగారెడ్డి జిల్లా బార్‌ అసోసియేషన్‌ హాల్‌లో నిర్వహించి రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నిజామాబాద్‌ బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడిగా ఉన్న జగన్‌మోహన్‌గౌడ్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, అధ్యక్షుడిగా కొండల్‌రెడ్డి (రంగారెడ్డి బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు), ప్రధాన కార్యదర్శిగా రాజవర్ధన్‌రెడ్డి(నాంపల్లి బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

12న నగరంలో జాబ్‌మేళా

నిజామాబాద్‌నాగారం: ప్రైవేట్‌ రంగంలో ఉద్యోగాల భర్తీ కోసం ఈనెల 12వ తేదీన జాబ్‌ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్‌ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరుణ్‌, ఎంజీఎం మోటార్స్‌లో ఈడీపీ ఎగ్జిక్యూటివ్‌, టెలీకాలర్‌, రిలేషన్‌షిప్‌ మేనేజర్‌, డెలివరీ ఇన్‌చార్జి, డ్రైవర్‌, సేల్స్‌ ఎగ్జిక్యూటివ్‌ పోస్టులు భర్తీ చేయనున్నారని పేర్కొన్నారు. పదో తరగతి, ఐటీఐ, ఎలక్ట్రీషియన్‌, డిగ్రీ, బీ టెక్‌ తదితర విద్యార్హతలు ఉండి 18 నుంచి 30ఏళ్ల లోపువారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నగరంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో బుధవారం ఉదయం 10.30 నుంచి 3.30 గంటల వరకు హాజరుకావొచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ వెంట బయోడేటాతోపాటు ఆధార్‌కార్డు, పదో తరగతి మెమో, ఫొటో తీసుకురావాలని, ఇతర వివరాలకు 95817 68413, 99487 48428, 63057 43423, 99594 56793 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

హ్యాండ్‌బాల్‌ అసోసియేషన్‌ టెక్నికల్‌ కమిటీ చైర్మన్‌గా యాసిన్‌



నిజామాబాద్‌నాగారం: తెలంగాణ హ్యాండ్‌బాల్‌ అసోసియేషన్‌ టెక్నికల్‌ కమిటీ చైర్మన్‌గా నిజామాబాద్‌ జిల్లా అసోసియేషన్‌ కార్యదర్శి మహ్మద్‌యాసిన్‌ తౌరడియా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 9న తెలంగాణ హ్యాండ్‌బాల్‌ అసోసియేషన్‌ చైర్మన్‌, హెచ్‌సీఏ ప్రెసిడెంట్‌ ఏ జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సురభి కాన్ఫరెన్స్‌హాల్‌లో నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశంలో యాసిన్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తేజ్‌ రాజ్‌సింగ్‌, కోచ్‌ రవి, శ్రీశివం, జోషి తదితరులు పాల్గొన్నారు.

20న నులిపురుగుల నివారణ దినం



నిజామాబాద్‌నాగారం: జాతీయ నులిపురుగుల నివారణ దినాన్ని ఈనెల 20వ తేదీన నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్‌ తెలిపారు. ఈ సందర్భంగా అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్‌ మీటింగ్‌ను ఆయా శాఖల జిల్లా అధికారుల సమక్షంలో ఐడీఓసీ మీటింగ్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ.. 1 నుంచి 19 ఏళ్ల లోపు వారందరూ నులిపురుగుల నివారణ కోసం అల్బెండజోల్‌ మాత్రలు తీసుకోవాలన్నారు. ఒకటి నుంచి రెండు సంవత్సరాల పిల్లలకు సగం మాత్రను పౌడర్‌లా చేసి నీటిలో కలిపి తాగించాలని సూచించారు. 20వ తేదీన అల్బెండజోల్‌మాత్ర తీసుకోని వారికి 27వ తేదీన అందించాలన్నారు. ఆయా శాఖలు సమన్వయంతో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో అడిషనల్‌ కలెక్టర్లు అంకిత్‌, కిరణ్‌కుమార్‌, మున్సిపల్‌ కమిషనర్‌ మకరండ్‌, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్‌ డీఐవో డాక్టర్‌ అశోక్‌, వెంకటేశ్‌, సచిన్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

135 విన్నపాలు నమోదు

సుభాష్‌నగర్‌: ప్రజావాణికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఎలక్షన్‌ కోడ్‌ కారణంగా తాత్కాలికంగా రద్దయిన ప్రజావాణి సోమవారం పునఃప్రారంభం కాగా, 135 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌తో రాజీవ్‌గాంధీ హనుమంతుతోపాటు అదనపు కలెక్టర్‌ అంకిత్‌, నగర పాలక సంస్థ కమిషనర్‌ మకరంద్‌, నిజామాబాద్‌ ఆర్డీవో రాజేంద్రకుమార్‌, డీఆర్డీవో సాయాగౌడ్‌ అర్జీలు అందజేశారు. అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలని ఆయా శాఖ అధికారులను కలెక్టర్‌ ఆదేశించారు.


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు

మహిళా సంఘంలో అవకతవకలు


కలెక్టరేట్‌ ఆవరణలో కల్దుర్కి గ్రామ మహిళలు

బోధన్‌ మండలంలోని కల్దుర్కి గ్రామ క్రాంతి మహిళా సంఘంలో అవకతవకలు జరిగాయని సభ్యులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సీఏ మనీష డబ్బులను తన సొంతానికి వాడుకుని నకిలీ ఓచర్లు, స్టాంపులు, సంతకాలు చేశారన్నారు. దీనిపై బోధన్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, గ్రామపంచాయతీ, గ్రామ సంఘంలో కూడా పలుమార్లు సమావేశం నిర్వహించినా.. సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమ డబ్బులు వాపస్‌ ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

విద్యార్థులకు న్యాయం చేయాలి


కలెక్టరేట్‌కు తరలివచ్చిన ఆర్మూర్‌ డివిజన్‌ బీఏఎస్‌ స్కీం విద్యార్థుల తల్లిదండ్రులు

ఆర్మూర్‌ డివిజన్‌లో బెస్ట్‌ అవైలబుల్‌ స్కూల్స్‌ (బీఏఎస్‌) స్కీం కింద చదువుతున్న విద్యార్థులకు న్యాయం చేయాలని బీఏఎస్‌ లబ్ధిదారుల తల్లిదండ్రులు కలెక్టర్‌ను కోరారు. మామిడిపల్లిలోని సెయింట్‌ పాల్స్‌ స్కూల్‌లో ఆరేళ్లుగా సుమారు 180 మంది విద్యార్థినీవిద్యార్థులు బెస్ట్‌ అవైలబుల్‌ స్కూల్స్‌ స్కీం కింద విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. 2022 నుంచి ప్రభుత్వం పాఠశాలకు బకాయిలు చెల్లించకపోవడంతో స్కూల్‌ యాజమాన్యం ఈ సంవత్సరం నుంచి స్కూల్‌కి రావొద్దని విద్యార్థులకు తెలిపిందన్నారు.

టీటీసీ అభ్యర్థుల ఆందోళన

టీచర్స్‌ ట్రైనింగ్‌ సర్టిఫికెట్‌ (టీటీసీ) శిక్షణలో వందశాతం అటెండెన్స్‌ నమోదు చేసి పరీక్షలు, డెమోలకు అనుమతించాలని అభ్యర్థులు సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చారు. ప్రజావాణిలో కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతుకు వినతి పత్రం అందజేసిన అనంతరం కలెక్టరేట్‌ ఆవరణలో బైటాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజామాబాద్‌, ఆదిలాబాద్‌, నిర్మల్‌, కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల నుంచి తాము శిక్షణ కోసం దరఖాస్తులు చేసుకోగా, 42 రోజులుగా శిక్షణ కొనసాగుతోందని తెలిపారు. అయితే, వందశాతం అటెండెన్స్‌ ఉన్న వారిని మాత్రమే పరీక్షలు, డెమోకు అనుమతిస్తున్నారని, సుమారు వంద మందికిపైగా అభ్యర్థులకు 75శాతానికిపైగా అటెండెన్స్‌ ఉన్నప్పటికీ అనుమతించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు శిక్షణకు గైర్హాజరైనా అనుమతించారని ఆరోపించారు. తమను పరీక్షలు, డెమోకు అనుమతించి న్యాయం చేయాలని కోరారు. ఏడీ నాగజ్యోతి, కోర్సు డైరెక్టర్‌ సాయిరెడ్డి, సీఐ సురేశ్‌ కుమార్‌ అభ్యర్థుల వద్దకు వచ్చి సముదాయించారు. మెడికల్‌ సర్టిఫికెట్లు ఉన్న వారిని మాత్రమే అనుమతిస్తున్నామని, మీ సమస్యను రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని సముదాయించినప్పటికీ అభ్యర్థులు అధికారులను నిలదీశారు. సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో అభ్యర్థులు వెనుదిరిగారు.


మాట్లాడుతున్న కోర్సు డైరెక్టర్‌ సాయిరెడ్డి

అయ్యప్ప స్కానింగ్‌ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలి



అయ్యప్ప స్కానింగ్‌ సెంటర్‌ ఉద్యోగి మహిళల ఫొటోలు, వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్‌ చేశాడని, వెంటనే స్కానింగ్‌ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని మహాజన సోషలిస్ట్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు పోశెట్టి మాదిగ డిమాండ్‌ చేశారు. ఈ మేరకు కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతుకు వినతి పత్రం అందజేశారు. ప్రైవేట్‌ స్కానింగ్‌ సెంటర్లలో మహిళా, పురుష ఉద్యోగులను వేర్వేరుగా నియమించాలన్నారు. ఆయనవెంట నవీన్‌, యాదగిరి, తదితరులున్నారు.

కుల జనగణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

కుల జనగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీఎల్‌ఎఫ్‌ రాష్ట్ర కన్వీనర్‌ దండి వెంకట్‌ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. స్థానిక సంస్థలకు రిజర్వేషన్‌ అమలు విషయంలో బీజేపీ, బీఆర్‌ఎస్‌ ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్నాయని ఆరోపించారు. ఎన్నికల సందర్భంగా బీసీ సీఎం అని ప్రచారం చేసిన బీజేపీ, కుల జనగణన తర్వాత స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ఎందుకు డిమాండ్‌ చేయడం లేదని ప్రశ్నించారు.


కలెక్టరేట్‌కు వచ్చిన బీఎల్‌ఎఫ్‌ నాయకులు

శ్మశాన వాటికలో స్నానపు గదులు నిర్మించాలి

నగరంలోని నాగారంలో ఉన్న ఎస్సీ శ్మశాన వాటికలో స్నానాల గదులను కూల్చి కమర్షియల్‌ కాంప్లెక్స్‌ను నిర్మించారని, తిరిగి స్నానపు గదులు నిర్మించాలని బాబూ జగ్జీవన్‌రామ్‌ (మాదిగ) సంఘం ప్రతినిధులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. శ్మశాన వాటిక 3 తర్చలకు చెందినదని తెలిపారు. మాజీ కార్పొరేటర్‌ కనకం సుధ భర్త కనకం సదానంద్‌ వైకుంఠధామం ప్యానెల్‌ లెటర్‌ ప్యాడ్‌ తయారు చేసి ప్రజాప్రతినిధులు ఇచ్చిన నిధులను స్వాహా చేశాడని ఆరోపించారు. వెంటనే సదానంద్‌ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. నిధులను రికవరీ చేసి, స్నానపు గదులను పునఃనిర్మించాలని కోరారు.

క్రైం కార్నర్‌

డివైడర్‌ పైనుంచి పడి ఒకరి మృతి



ఖలీల్‌వాడి: రోడ్డు డివైడర్‌ పైనుంచి పడి ఒకరు మృతి చెందిన సంఘటన నగరంలోని నాల్గో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. వినాయక్‌నగర్‌కు చెందిన ఆరేపల్లి గౌతం(42) యాదగిరి బాగ్‌ కమాన్‌ వద్ద రోడ్డు దాటేందుకు డివైడర్‌ ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. మృతుడి బంధువు విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంజీవ్‌ తెలిపారు.

రైలులో నుంచి జారిపడి..


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఖలీల్‌వాడి: సిర్నాపల్లి – ఉప్పల్‌వాయి స్టేషన్ల మధ్య నడుస్తున్న రైలులో నుంచి గుర్తు తెలియని వ్యక్తి జారిపడి మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి సోమవా రం తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 45 ఏళ్లు ఉంటుందని, ఒంటిపై వైట్‌ టీషర్ట్‌, బ్లూ జీన్స్‌ ఉన్నాయన్నారు. మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించామని, మృతుడి వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని సూచించారు.

నలుగురి బైండోవర్‌

ఇందల్వాయి: మండలంలోని వెంగళపహాడ్‌ తండాకి చెందిన ముగ్గురితోపాటు దేవితండాకు చెందిన ఒకరిని తహసీల్దార్‌ ఎదుట బైండోవర్‌ చేసినట్లు ఎక్సైజ్‌ సీఐ మాధవరావు సోమవారం తెలిపారు. నాటుసారా తయారు చేస్తుండగా నలుగురిని పట్టుకున్నామన్నారు. నాటు సారా తయారీ, గంజాయి సాగు వివరాలు తెలిస్తే తమకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. కానిస్టేబుల్‌ మహేశ్‌, చందర్‌, జగదీశ్‌ పాల్గొన్నారు.

బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మండలం చేపూర్‌ గ్రామ శివారులోని బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై అశోక్‌ ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అక్కడే పోస్టుమార్టం చేయించి అంత్యక్రియలు చేయించారు. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఫర్టిలైజర్‌ దుకాణంలో చోరీ


స్థానికులను విచారిస్తున్న ఎస్సై శ్రీకాంత్‌

మద్నూర్‌(జుక్కల్‌): మండలంలోని మేనూర్‌లో ఉన్న కిసాన్‌ ఫర్టిలైజర్‌ దుకాణంలో దుండగులు ఆదివారం రాత్రి చోరీకి పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. తన దుకాణం రేకుల షెడ్డులో కొనసాగుతోందని, దుండగులు వెనుకవైపు నుంచి రేకులను తొలగించి రూ.70వేల నగదుతోపాటు, సీసీ కెమెరాలకు సంబంధించిన డీవీఆర్‌ను ఎత్తుకెళ్లారని బాధితుడు సంతోష్‌ పటేల్‌ తెలిపారు. ఎస్సై శ్రీకాంత్‌ ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కేబుల్‌, ఆయిల్‌..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి శివారులో ఉన్న వ్యవసాయభూమిలోని ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి దుండగులు ఆయిల్‌, కేబుల్‌ చోరీ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. గత కొంత కాలంగా మండలంలోని ఆయా గ్రామాల్లో బోరు బావుల కేబుళ్లు, ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి కాపర్‌, ఆయిల్‌ను ఎత్తుకెళ్తున్నారని గ్రామస్తులు తెలిపారు. చోరీలపై లింగంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. తరచూ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ జరుగుతుండడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్‌ పట్టివేత

రుద్రూర్‌: పోతంగల్‌ మండలం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను కోటగిరి మండలం ఎత్తొండ శివారులో స్థానికులు సోమ వారం పట్టుకున్నారు. అనంతరం తహసీల్దార్‌కు సమాచారం అందించగా, రెవెన్యూ సిబ్బంది ట్రాక్టర్‌ను తహసీల్‌ కార్యాలయానికి తరలించారు.

55 వాహనాలు పట్టివేత


తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని రుక్మిణి చాంబర్స్‌ వద్ద ట్రాఫిక్‌, నాల్గో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ సిబ్బందితోపాటు ఆర్టీఏ అధికారులు ఉమ్మడిగా సోమవారం తనిఖీలు నిర్వహించారు. సీపీ కల్మేశ్వర్‌ సింగనవార్‌ ఆదేశాల మేరకు ఏసీపీ రాజా వెంకట్‌ రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టి పోలీసులు, ఆర్టీఏ అధికారులు.. నంబర్‌ ప్లేట్లు, రిజిస్ట్రేషన్‌ లేకపోవడం, ట్రిపుల్‌ రైడింగ్‌, మైనర్‌ డ్రైవింగ్‌ తదితర కారణాలతో 55 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి తదుపరి చర్యల నిమిత్తం ఆర్టీఏ అధికారులకు అప్పగించారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే డ్రైవింగ్‌ చేసిన వారితో పాటు వాహన యాజమానిని సైతం న్యాయస్థానం ఎదుట హాజరుపరుస్తామని అధికారులు స్పష్టం చేశారు. గతంలో మైనర్‌ డ్రైవింగ్‌ చేస్తూ పట్టుబడితే జరిమానా విధించి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్‌ ఇచ్చి పంపించేవారిమని, ఇక నుంచి న్యాయస్థానంలో హాజరుపరుస్తామని పేర్కొన్నారు. తనిఖీలో ట్రాఫిక్‌ సీఐ వెంకటనారాయణ 2, 3, 4 టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ల ఎస్సైలు రామ్‌, ప్రవీణ్‌, సంజీవ్‌, ట్రాఫిక్‌ ఆర్‌ఎస్సై సుమన్‌, సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటకకు తరలుతున్న ఎరువులు

- రైతుల పేరుతో అక్రమ వ్యాపారం
- చోద్యం చూస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు
- అంతర్రాష్ట్ర సరిహద్దులో తనిఖీలు కరువు
- మద్నూర్‌, బిచ్కుందలో డీఏపీ కొరత


ఆటోలో కర్ణాటకకు తరలిస్తున్న స్పిక్‌ డీఏపీ ఎరువులు (ఫైల్‌)

బిచ్కుంద(జుక్కల్‌) : ఖరీఫ్‌ సీజన్‌ పంటల సాగులో భాగంగా అడుగు మందుగా ఎక్కువ మంది రైతులు స్పిక్‌ డీఏపీని వాడుతున్నారు. ఇతర కంపెనీ డీఏపీ అందుబాటులో ఉన్నప్పటికీ వాటికి ఎక్కువ డిమాండ్‌ లేదు. ఎన్నో ఏళ్ల నుంచి బిచ్కుంద, జుక్కల్‌, మద్నూర్‌ మండలాలతోపాటు అంతర్రాష్ట్ర సరిహద్దులోని కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంత రైతులు కూడా స్పిక్‌ డీఏపీని వాడుతుండడంతో డిమాండ్‌ ఎక్కువగా ఉంది. ప్రస్తుతం పత్తి, సోయా విత్తనాలు అలకడం పనులను ప్రారంభించిన రైతులు స్పిక్‌ డీఏపీ కోసం ఎరువుల డీలర్ల వద్ద క్యూ కడుతున్నారు. ఇదే అదునుగా భావించిన దుకాణదారులు బస్తాపై రూ.200 అదనంగా తీసుకుంటున్నారు. బిచ్కుంద, జుక్కల్‌, మద్నూర్‌, పెద్దకొడప్‌గల్‌ మండలాల రైతులు అదనంగా డబ్బులు ఎందుకు తీసుకుంటున్నారని డీలర్లను నిలదీస్తుండడంతో డీఏపీ కొరత సృష్టించి బ్రోకర్లను నియమించుకొని కర్ణాటకలోని గ్రామాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కర్ణాటక పంపిస్తున్న ఆటోలను రైతులు ఇటీవల అడ్డుకుని వ్యాపారులను నిలదీశారు. ఈపీవోఎస్‌ యంత్రంలో రైతు ఆధార్‌ నంబర్‌ లేక వేలిముద్ర తీసుకొని ఎరువులు విక్రయించాల్సి ఉంటుంది. అయితే, బిచ్కుంద, మద్నూర్‌, జుక్కల్‌ మండలాల గుట్టలు, బీడు భూములలో పంటలు సాగుచేయని రైతుల ఆధార్‌ నంబర్లను పలువరు వ్యాపారులు బ్రోకర్ల ద్వారా సేకరించి ఈపీవోఎస్‌ సిస్టమ్‌లో నమోదు చేసి వారి పేర్లతో బిల్లులు సృష్టించి కర్ణాటకకు ఎరువులను తరలిస్తున్నారని రైతులు అంటున్నారు. ఏవో స్థానికంగా ఉండకపోవడంతో తనిఖీలు, చర్యలకు అవకాశం లేకుండాపోయింది. ఇదే అదునుగా భావించిన డీలర్లు ఎరువులను అధిక ధరలకు విక్రయించడంతోపాటు ఆటోల్లో కర్ణాటకకు తరలిస్తున్నారు. కలెక్టర్‌ స్పందించి ఎరువులు బ్లాక్‌ మార్కెట్‌కు తరలిపోకుండా చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

సరిహద్దులు దాటుతున్న ఎరువులు..

గతంలో రాష్ట్ర సరిహద్దులు దాటి ఎరువులు తరలించకుండా జిల్లా అధికార యంత్రాంగం పోలీసులు, వ్యవసాయ అధికారుల సమన్వయంతో తనిఖీలు చేపట్టేది. ప్రస్తుతం అలాంటి చర్యలు లేకపోవడంతో ఎరువుల బస్తాలు యథేచ్ఛగా రాష్ట్ర సరిహద్దులు దాటుతున్నాయి. ఈ విషయాన్ని జిల్లా వ్యవసాయ అధికారిణి భాగ్యలక్ష్మి దృష్టికి తీసుకెళ్లగా.. రెండు రోజుల్లో బిచ్కుందకు కొత్తగా ఏడీఏ వస్తున్నారని, ఎరువులు ఇతర రాష్ట్రాలకు తరలించకుండా తనిఖీలు చేయాలని ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ఏవో అందుబాటులో ఉండేలా చూస్తానని అన్నారు.

కొనసాగుతున్న ధ్రువపత్రాల పరిశీలన

నిజామాబాద్‌అర్బన్‌: జిల్లా విద్యాశాఖలో పండితులు, పీఈటీల పదోన్నతులకు సంబంధించి ధ్రువపత్రాల పరిశీలన కొనసాగుతోంది. సోమవారం మొదటి విడతగా పరిశీలన చేపట్టారు. నేడు కూడా డ్యాంకుమెంట్స్‌ వెరిఫికేషన్‌ కొనసాగనుంది.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


కామారెడ్డిలో సమావేశమైన పూర్వవిద్యార్థులు

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వాసవి పబ్లిక్‌ స్కూల్‌(2002 – 03బ్యాచ్‌)లో, నిజామాబాద్‌ రూరల్‌ మండలం గుండారం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల(2003 – 04బ్యాచ్‌)లో సోమవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 20 ఏళ్ల తరువాత ఒకే వేదికపైకి చేరుకున్న స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. తమకు పాఠాలు బోధించిన గురువులను సన్మానించారు.

–కామారెడ్డి టౌన్‌/నిజామాబాద్‌ రూరల్‌


నిజామాబాద్‌ మండలం గుండారంలో..

చెస్‌ బాక్సింగ్‌లో విద్యార్థిని ప్రతిభ


చెస్‌ బాక్సింగ్‌లో మూడు బంగారు పతకాలు సాధించిన ప్రతిభ

పిట్లం(జుక్కల్‌): కేరళ రాష్ట్రంలోని జూబ్లీ మెమోరియల్‌ హాల్‌, త్రివేండ్రంలో ఈనెల 7, 8, 9వ తేదీల్లో నిర్వహించిన 12వ చెస్‌ బాక్సింగ్‌ జాతీయ చాంపియన్‌షిప్‌లో పిట్లం ప్రతిభ హైస్కూల్‌ నిర్వాహకులు నర్సింగ్‌రావ్‌ కూతురు ప్రతిభ సీనియర్‌ మహిళా విభాగంలో 3 బంగారు పతకాలు సాధించగా ఆమె తమ్ముడు అయిన విజయ్‌ రాఘవేంద్ర రావు సీనియర్‌ పురుషుల విభాగంలో వెండి పతకంను సాధించాడు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావ్‌ మాట్లాడుతూ తన కూతురు ప్రతిభకు జుక్కల్‌ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు స్పాన్సర్‌షిప్‌ అందించినందుకు, అదేవిధంగా టీమ్‌ తెలంగాణకు ట్రావెలింగ్‌ స్పాన్సర్‌షిప్‌ అందించిన మాజీ డీసీసీబీ చైర్మన్‌ పోచారం భాస్కర్‌ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

జంతు సంరక్షణకేంద్రం పరిశీలన


జంతు సంరక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్‌

కామారెడ్డి క్రైం : కామారెడ్డి మండలం రామేశ్వర్‌పల్లిలో ఏర్పాటు చేసిన జంతు సంరక్షణ కేంద్రాన్ని సోమవారం కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ పరిశీలించారు. కామారెడ్డి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జంతువులకు రక్షణ కేంద్రం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్‌ తెలిపారు. కుక్కలకు ఇక్కడ శస్త్ర చికిత్సలు చేయించనున్నట్లు పేర్కొన్నారు. కుక్కల బారి నుంచి ప్రజలను రక్షించడానికి జంతువుల రక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌ సుజాత, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సింహరావ్‌, అధికారులు సంజయ్‌, రవీందర్‌, తదితరులు పాల్గొన్నారు.

చైన్‌ స్నాచర్ల అరెస్ట్‌



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ బస్వారెడ్డి

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ డివిజన్‌లోని పలు పోలీస్‌ స్టేషన్‌ల పరిధిలో చైన్‌ స్నాచింగ్‌కు పాల్పడిన నిందితులను అరెస్టు చేసినట్లు ఏసీపీ బస్వారెడ్డి తెలిపారు. పట్టణంలోని తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట్‌కు చెందిన అబ్దుల్‌ సాజిద్‌, పాతూరి తరుణ్‌, నిజామాబాద్‌ జిల్లా డిచ్‌పల్లికి చెందిన బోయర్‌ శేఖర్‌, మిర్చి కాంపౌండ్‌కు చెందిన వర్మజి చంటి సాయికుమార్‌ కలిసి ఆర్మూర్‌, బాల్కొండ, మోర్తాడ్‌ పోలీస్‌ స్టేషన్‌ల పరిధిలో చైన్‌ స్నాచింగ్‌లకు పాల్పడ్డారని తెలిపారు. మోర్తాడ్‌ మండలం దొన్కల్‌ 63వ నంబరు జాతీయ రహదారిపై సోమవారం పెట్రోలింగ్‌ నిర్వహిస్తుండగా నలుగురు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించగా తాము చేసిన నేరాలను అంగీకరించారన్నారు. నిందితుల నుంచి రెండు ద్విచక్ర వాహనాలతోపాటు 15 తులాల 7 గ్రాముల బంగారు చైన్‌లను స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచామన్నారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన మోర్తాడ్‌ ఎస్సై అనిల్‌రెడ్డి, కానిస్టేబుళ్లు సురేశ్‌, నారాయణ, నవీన్‌ చంద్రను ఈ సందర్భంగా ఏసీపీ అభినందించారు. సమావేశంలో భీమ్‌గల్‌ సీఐ శ్రీనివాస్‌, సిబ్బంది పాల్గొన్నారు.